ఘనంగా బక్రీద్ పర్వదినం

తమ జీవితాలను సన్మార్గంలో నడుపుట కొరకు ప్రార్థిస్తూ ఉండాలి. ముస్లింలు ఆచరించే ఐదు సూత్రాల్లో ఐదవదైన హజ్ సందర్భంగా ఆచరించే నమాజునే ఈదుల్ అజూహా అంటారు. ఇస్లాం మత వ్యాప్తి కోసం దేవుని ఆజ్ఞ కోసం తన కన్న బిడ్డను సైతం తన చేతులతో బలిదానం (కుర్బానీ) ఇచ్చేందుకు సిద్ధపడిన రోజున ముస్లింలు బక్రీద్ పర్వదినంగా జరుపుకుంటారు. బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు చింతపల్లి మసీదులో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని ఒకరికొకరు ఆలింగనం చేసుకుని సోదర భావాన్ని పంచుకున్నారు.

విశాలాంధ్ర-చింతపల్లి : త్యాగానికి ప్రతీకగా ముస్లింలు నిర్వహించుకునే పర్వదినం బక్రీద్. ఈదుల్ అజూహాగా పిలుచుకునే ఈ పర్వదినానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఇబ్రహీం సల్లల్లాహు అలైహి వ సల్లం అల్లా (భగవంతుని) ఆజ్ఞతో తన కన్న బిడ్డను బలి ఇవ్వటం గమనిస్తే త్యాగనిరతకి నిదర్శనంగా చెప్పవచ్చు. దాన్ని పురస్కరించుకొని ముస్లింలు ఈదుల్ అజూహా పేరిట ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు పర్వదినా లంటే నూతన వస్త్రాలు ధరించడం ఆనందంగా గడపడమే కాదు అన్ని జన్మలలో కెల్లా అత్యుత్తమమైన మానవ జన్మను ప్రసాదించిన అల్లాకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ భక్తి శ్రద్ధలతో అల్లా సన్నిధిలో (మసీదులో) సామూహికంగా మోకరిల్లి

గురుకులంలో గెస్ట్ టీచర్స్, లెక్చరర్స్ సమస్యలను పరిష్కరించాలి

మాజీ మంత్రి కిడారికి వినతి
సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానంటూ హామీ

విశాలాంధ్ర-అనంతగిరి : అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీ రెసిడెన్సీయల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ (సొసైటీ) గురుకులం పనిచేస్తున్న గెస్ట్ ఉపాధ్యాయుల, లెక్చరర్స్ సమస్యలను పరిష్కరించాలని అరకు పార్లమెంట్ అధ్యక్షులు మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌ని కలిసి గత 10 సంవత్సరాల పైబడి గురుకులంలో గెస్ట్ ఉపాధ్యాయులు, లెక్చరర్స్‌గా పనిచేస్తున్నామని, కానీ గత ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేసారు. సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గెస్ట్ ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళి గెస్ట్ ఉపాధ్యాయుల,లెక్చరర్స్ సమస్యలు తప్ప కుండ పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.

అరకు పార్లమెంట్ నియోజకవర్గ పురోభివృద్ధికి మరింత కృషి అవసరం

తనూజారాణి దంపతులను కలిసిన వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దంపతులు

విశాలాంధ్ర-చింతపల్లి : అరకు పార్లమెంట్ నియోజకవర్గం మరింత పురోభివృద్ధికి కృషి చేయాలని వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ జెల్లీ హెలియా రాణి దంపతులు అన్నారు. అరకు పార్లమెంటు సభ్యురాలు గుమ్మ తనుజారాణి, వినయ్ దంపతులను అల్లూరి జిల్లా పాడేరు క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ దంపతులకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలపడంతో పాటు దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గడచిన మూడు దఫాలుగా అరకు పార్లమెంట్ లో మహిళలే విజయదుందుబీ మోగించడం యాదృచ్ఛికం అన్నారు. అదే క్రమంలో మూడుసార్లు వైకాపా విజయం సాధించి హ్యాట్రిక్ విజయ నమోదు చేసిందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభంజనంలోనూ అరకు పార్లమెంట్, అరకు, పాడేరు శాసనసభ స్థానాలను వైకాపా కైవసం చేసుకోవడం మన్యప్రాంత ప్రజలకు ఆ పార్టీపై ఉన్న విశ్వసనీయతకు నిదర్శనం అన్నారు. పార్లమెంట్లో వైకాపా ఎంపీల అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ అవసరతను దృష్టిలో ఉంచుకొని అరకు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని తనుజారాణి, వినయ్ దంపతులకు ఈ సందర్భంగా వారు సూచించారు.

చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

పాడేరు ఎన్డీఏ కూటమి తెదేపా ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర-పాడేరు : ఇటీవల పాడేరులో జరిగిన మోదకొండమ్మ అమ్మవారి జాతరలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం జరగడం చాలా బాధాకరమని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి తెదేపా ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. గిడ్డి నివాస గృహంలో సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమెమాట్లాడుతూ అత్యాచారం చేసిన నిందితులను అరెస్టు చేశామని పోలీసులు చెప్పారన్నారు.అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మరొకరు ఇలాంటి అత్యాచారాలు చేయాలంటేనే భయపడే విధంగా బాధితులను శిక్షించాలని పోలీస్ శాఖ అధికారులను ఆమె కోరారు. బాధిత బాలికకు న్యాయం జరగాలని అన్నారు. బాధిత బాలికకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, పెద్దవాడు తదితరులు పాల్గొన్నారు.

అనుభవం ఉన్న వ్యక్తికి అధికారం వస్తే అన్నీ సాధ్యమే...

తెదేపా కార్య నిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు

విశాలాంధ్ర-చింతపల్లి : అనుభవం ఉన్న వ్యక్తికి అధికారం కట్టబెడితే నిర్ణయాలు వేగవంతంగా తీసుకునే సాహసం చేస్తారు అనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలే ఉదాహరణ అని తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అనుభవం ఉన్న వ్యక్తి కావడం వలననే చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టగానే సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు పరుస్తున్నారన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీతో పాటు నాలుగు వేల రూపాయల సామాజిక పెన్షన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు తదితర దస్త్రాలపై తొలి సంతకంచేసి ఇచ్చిన హామీని వారం తిరగకముందే అమలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో వైయస్ జగన్మోహన్ రెడ్డి సామాజిక పెన్షన్ 3000 రూపాయలు ఇస్తానని అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల కాలంలో ప్రతి ఏటా 250 రూపాయల చొప్పున పెంచుకుంటూ 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి సామాజిక పెన్షన్ 3,000 ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సామాజిక పెన్షన్ నాలుగు వేల రూపాయలు ఇస్తామన్న తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు హామీని నమ్మిన ప్రజలు ఆయనకు అధికారం కట్టబెట్టారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పెన్షన్ అమలు దస్త్రంపై తొలి సంతకం చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న నేత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

ఎన్‌హెచ్-516 ఈతో భూములు కోల్పోయిన రైతుల ఆందోళన

విశాలాంధ్ర-జీకే వీధి: మండలంలోని పెదవలస పంచాయతీకి సంబంధించి రంపుల, చాపరతిపాలెం, పెదవలస గ్రామలలో రోడ్డుకు ఇరువైపులా ఎన్‌హెచ్ 516 రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులు ఆందోళన బాట పట్టారు. గతంలో రెవిన్యూ భూమికి, కాఫీ మొక్కలకు మండల పాడేరు రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో కాఫీ మొక్కలకు మిరియాల మొక్కలకు రైతుల సమక్షంలో నష్టపరిహారం అంచనాలు వేయటం జరిగింది. ముందుగా రంపుల గ్రామం చాపరతిపాలెం రైతులకు కొంత మొత్తం నష్టపరిహారం అందినది. నష్ట పరిహారంలో దేనికి ఎంతా (పట్టా భూమికి & కాఫీ మొక్కలకు) పరిహారం చెల్లించారో అనే స్పష్టత లేదని, ఈ విషయమై ఎవరికి అడగలే కూడా తెలియటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తాన్నారు. సర్వే చేసినప్పుడు తీసుకున్న కొలతలకంటే పనులు చేస్తున్నారని, అధనంగా మొక్కలు, భూమిని కోల్పోతున్నామని, ఈ మొక్కలు భూమికి ఎవరు నష్టపరిహారం చెల్లిస్తారు అని, ఈ వ్యవహారం పూర్తిగా గందరగోళంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ.పీ.ఎఫ్.డిసి అధికారులు ఇచ్చిన అంచనాలను పరిగణంలో తీసుకొని, నష్టపోతున్న కాఫీ మొక్కలు కంటే చాలా తక్కువ మొక్కలు పోతున్నటు రికార్డు చేసుకున్నారని, ఏ.పీ.ఎఫ్.డి.సి వారి ప్లాంటేషన్ కొలతలకు రైతులు ప్లాంటేషన్‌లో మొక్క మొక్క మధ్య చాలా తేడాలు వుంటాయని, కేవలం ఏ.పీ.ఎఫ్.డి.సి అధికారుల వారి గణకాలు ప్రకారం తీసుకోవటం వల్ల చాలా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో కాఫీ మొక్కకు మిరియాల మొక్కకు ఎంత నష్టపరిహారం ఇస్తున్నారో కూడా తెలియదని, పూర్తిగా కాఫీ పంట పైన ఆధారపడి బ్రతికే కాఫీ రైతుకు నష్టపరిహారం ఎన్ని సంవత్సరలు ఇస్తారో కూడా ఎవరు స్పష్టత ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు మొక్కలు అంచనా వేయటంలో పూర్తిగా విఫలమయారని, ఆర్ధిక పంట కాఫీ కాబట్టి రైతుల లెక్కల ప్రకారం నష్టపరిహారం ఇప్పించ వలసిందిగా బ్రతిమిలాడిన, రికార్డులలో మాత్రం చాలా తక్కువ మొక్కలు నమోదు చేసుకున్నారని రైతులు వాపోయారు. మొక్కలకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు ప్రారంభించలి అని రైతులు కోరుతున్నారు. తక్షణమే అల్లూరి జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టి సారించి నష్టపోతున్న కాఫీ రైతులకు న్యాయం చేయాలనీ రైతులు వేడుకుంటున్నారు.

గాలివాన బీభత్సానికి నష్టం వాటిల్లిన ఇండ్లను పరిశీలన

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : ఆదివారం సాయంత్రం కురిసిన భారీ గాలివాన బీభత్సానికి మండలం లోనిరాజుపేట కాలనీ, వడ్డీ గూడెం, రేఖపల్లి గ్రామాలలో ఇళ్లపై చెట్లు/ కరెంటు స్తంభం కూలి పాక్షికంగా, పూర్తిగా నష్టం వాటిల్లిన ఇళ్లను సోమవారం స్థానిక తహసిల్దార్ మౌలానా ఫాజిల్ ఆధ్వర్యంలో ఉదయం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గ్రామ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించడమైనది. వివరములు నమోదు చేసుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధితులకు రావలసిన నష్టపరిహారంను మంజూరు చేయుటకు పైఅధికారులకు నివేదిక సమర్పించబడుననీ ఆయన తెలపడం అయినది.

పోలవరం ప్రాజెక్టు సందర్శనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత.

ఎంపీ తనుజరాణిను కలసిన ఎంపీపీ, ఎంపీటీసీలు

విశాలాంధ్ర-జీకే వీధి : అరకు పార్లమెంటు సభ్యులుగా గెలుపొందిన తనుజరాణిని గూడెం కొత్త వీధి వీధి మండల ఎంపీపీ బోయిని కుమారి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ నివాసంలో సర్పంచులు ఎంపీటీసీలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ వంచల జరెల ఎంపీటీసీలు లకవరపేట మాజీ సర్పంచ్ కంకిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు

విశాలాంధ్ర-కురుపాం : స్థానిక జామియా మసీదు లో బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ (మత గురువు) సర్దార్ ఆలం ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఈ సందర్భంగా బక్రీద్ పండుగ అల్ల ఆజ్ఞ మేరకు తన కన్న కొడుకునే త్యాగం చేయటానికి సిద్ధమైన దైవదూత మొహమ్మద్ ప్రవక్త త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. త్యాగం, దానం, సోదర భావం మరియు భక్తి ఈ పండగ ముఖ్య ఉద్దేశ్యం తెలిపారు. నమాజ్ అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ప్రత్యేక ప్రార్థనలో కురుపాంతోపాటు చిన మేరంగి, గుమ్మలక్ష్మీపురం నుంచి కూడా ముస్లింలు హాజరయ్యారు.

బక్రీద్ సందర్భంగా పేదలకు చీరల పంపిణీ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కోమిరి కృష్ణమూర్తి హెడ్ బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణపరిధిలోని నవిరి కాలనీలోని పేద మహిళలకు, వికలాంగులకు, వృద్ధులకు చీరలు, స్టీల్ గ్లాస్‌లు పంపిణీ చేసి వారి ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నవిరి కాలినీ పెద్దలు హెచ్చర్ల సింహాచలం, ఎర్రయ్య, హరికృష్ణ, ఎం.నాగభూషన్‌నాయుడు, కె.శ్రీను, ఎం.పైడిపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్‌లో మినీ వ్యాన్ బోల్తా... 16 మందికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-సీతంపేట : మండలం పాంద్ర, కింద్రువాడ గ్రామాలకి చెందిన సుమారు 24 మంది సీతంపేట సంతకు వెళ్లామనే ఉద్దేశ్యంతో పాంద్ర గ్రామానికి చెందిన సవర జాన్ అనే అతని మినీ వేన్ నెం. AP-30TA-3635లో వస్తుండగా గెద్దగుడా నుండి మెట్టుగూడ గ్రామానికి మధ్యలోగల సిమెంట్ రోడ్డు మలుపులో రహదారి బాగా డౌన్‌గా వచ్చేసరికి మినీ వేన్ ను నడుపుతున్న డ్రైవర్ తన వాహనం మీద నియంత్రణ కోల్పోవడంతో మినీ వేన్ రోడ్డు ప్రక్కన పడిపోవడంతో, 7గురికి తీవ్ర గాయాలయినట్లు, 9మందికి చిన్న గాయాలయినట్లు వైద్య అధికారులు తెలిపారు. డ్రైవర్ తో పాటు మరో 9మందికి ఎటువంటి గాయాలు తగల పోవడంతో వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. తీవ్ర గాయాలైనవారికి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి రిఫెర్ చేయగా, ఒకరు పరిస్థితి విషమంగా ఉండటంతో జేమ్స్ ఆసుపత్రిలో రిఫర్ చేశారు. మరో 9 మందికి సీతంపేట ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు ఈ రోడ్డు ప్రమాద సంఘటనపై సవర లుక్కో పాంద్ర గ్రామం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ సంజీవ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలియపరిచారు. ఈ ప్రమాద సంఘటన తెలుసుకున్న పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ వైద్యాధికారులతో మాట్లాడి వారికి మెరుగైన అందించాలని సూచించారు అదేవిధంగా తోటపల్లి ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ నిమ్మక పాండురంగ క్షతగాత్రులు వద్దకు వెళ్లి పరామర్శించారు ఈయనతోపాటు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సవరతోట ముఖలింగం పాల్గొన్నారు.

మంత్రిగా సంధ్యారాణి బాధ్యతల స్వీకరణ

ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎమ్‌ల నియామకంపై తొలి సంతకం

విశాలాంధ్ర-సాలూరు : స్త్రీశిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా సంధ్యారాణి సోమవారం వెలగపూడిలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించే ముందు కుటుంబ సభ్యలతో కలసివెళ్ళి ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించి వేద పండితుల ఆశీర్వచనం పొందారు.అనంతరం సచివాలయంలో మూడవ బ్లాక్ మొదటి అంతస్తులో ఉన్న కార్యాలయం లో కుటుంబ సభ్యులతో కలసి ఆమె ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. గిరిజన సంక్షేమ,స్త్రీ, శిశు సంక్షేమ ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరై అభినందనలు తెలిపారు.గిరిజన సంక్షేమ మంత్రిగా ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎమ్‌ల నియామకంపై తొలి సంతకం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయి ఎఎన్ఎమ్ లేకపోవడం వలన గిరిజన విద్యార్థులకు శాపంగా ఉండేది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించి వారికి ఉపయోగపడే విధంగా తొలి సంతకం చేయడంతో గిరిజన విద్యార్థులు, గిరిజన సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

వైన్ షాప్ సిబ్బందిని ఆదుకోవాలి

విశాలాంధ్ర-కురుపాం : నూతన ప్రభుత్వం ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న ఉద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం ప్రభుత్వ మద్యం దుకాణం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హాయంలో ఉపాధి అవకాశాలు లభించాయని ఆశతో ఉద్యోగులుగా చేరామని ఇప్పుడు మద్యం ప్రైవేటు పరం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో కుటుంబాలు వీధిన పడకుండా నూతన ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రియల్టర్లకు కాసుల పంటగా మారుతున్న ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు

- లక్షల్లో ప్రభుత్వ ఖజానాకు గండి
- నిబంధనలకు నీళ్ళొదులుతున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు
- ఫిర్యాదు వచ్చిన ప్రతిసారి తూతూమంత్రంగా నోటీసులు... వసూళ్లు

విశాలాంధ్ర-కురుపాం : మేజర్ పంచాయతీ పరిధిలోని అనధికార లేఅవుట్‌లు, ఆక్రమిత ప్రభుత్వ భూములలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులు వారికి కాసుల పంటగా మారుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు చేరాల్సిన అధిక మొత్తం పలువురు అధికారుల జేబుల్లోకి చేరుతున్నాయనేది బహిరంగ విమర్శ. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఏదైనా సంస్థ రియలెస్టేట్ లే అవుట్ వేయాలంటే ముందుగా గ్రామ పంచాయతీ/మున్సిపాలిటీ నుంచి ప్లానింగ్ అప్రూవల్ టౌన్ ప్లానింగ్ శాఖకు తమ లేవుట్‌లో రహదారి, మురుగు కాల్వలు, తాగునీటి, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేసిన వివరాలు అందజేసి వారి క్షేత్రస్థాయిలో సందర్శన తర్వాత ప్రభుత్వానికి కొలతలు ప్రాప్తికి సూచించిన మొత్తం చెల్లించి సంబంధించిన అనుమతి పొందాలి. కాని కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలసిన రియలెస్టేట్‌ల ద్వారా ఖజానాకు చేరిన మొత్తం అరకొర మాత్రమే అని చెప్పక తప్పదు. అంతేకాకుండా రెవెన్యూ శాఖకు ముందే ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు, లేఅవుట్ వేసేందుకు అనుమతి తీసుకోవాలి. కానీ ఫిర్యాదులు అందిన ప్రతీసారీ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం తూతూ మంత్రంగా నోటీసులు జారీ చేసి రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన మొత్తం స్వంత జేబుల్లో నింపుకుంటున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. ఫలితంగా రియలెస్టేట్ వ్యాపారులు దగాకోరు తనానికి అడ్డూ ఆపు లేకుండా పోయి సామాన్య ప్రజలకు అందని ఎత్తులో స్థలాలు ధరలు చేరుకుని ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎలాగో ఏర్పడిన అనధికార బంధాన్ని ఆసరాగా చేసుకుని రియలెస్టేట్‌ల్లో ప్రభుత్వ, అసైన్డ్, డిపట్టా భూములను కలుపుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్నికలు ముందు ఓ ఉన్నతాధికారి ఏకంగా రామదాసు అవతారం ఎత్తి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ, కార్యాలయం ముందు రేకులు షెడ్, కార్యాలయంకు అవసరమైన ఏర్పాట్లు రియలెస్టేట్ వ్యాపారుల్లో తలపండిన మాజీ ప్రజాప్రతినిధి ద్వారా నిర్మించేశారు. ఎన్నికలు సమయంలో ఎలాంటి నిధులు లేకుండా జరిగిన నిర్మాణాలకు డబ్బు ఎలా వచ్చింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇలా చేయడం తప్పు అని మందలించి శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సింది పోయి ఏదో ఒక విధంగా ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని తర్వాత భాధ్యతలు స్వీకరించిన అధికారిని నోటి ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. గతంలో అడపాదడపా రెవెన్యూ కార్యాలయాలపై ఎసిబి సోదాలు నిర్వహించి హెచ్చరించినప్పటికీ బేఖాతరుగా ఉన్నతాధికారులు ఈ నూతన ప్రభుత్వంలో తీరుమార్చుకుంటారో పాత అక్రమార్జన దోరణి కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే.

రెవెన్యూ సేవలకు ధరలు పట్టిక పాటించాల్సిందే : కురుపాం తహశీల్దార్ కార్యాలయంలో సామాన్య ప్రజలు రెవెన్యూ సేవలు పొందాలంటే వారు గతఏడాది కాలంగా ఏర్పాటుచేసిన నూతన ధరలు పట్టిక పాటించాల్సిందే లేదంటే సేవలు అక్కర్లేదని దూరంగా ఉండిపోవాల్సిందేనన్న బహిరంగ ఆరోపణలు ప్రజలు నుంచి బలంగా వినిపిస్తున్నాయి. మ్యుటేషన్, ప్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ల్యాండ్ సర్వే, ఇలా ప్రతీ దానికీ ఓధర నిర్ణయించారు. దానిని ఫాలో అయితే యువ అధికారి రంగం లోకి దిగి సర్వం తానై రెవెన్యూ కరుణా కటాక్షం చూపిస్తారు. లేదంటే కాళ్లరిగేలా రెవెన్యూ ప్రదక్షిణలు చేయాల్సిందే. కాసుల వర్షం కురిపించే వారికి ఎదురుగా వెళ్లి రెడ్ కార్పెట్ వేసి ఉత్సాహం చూపుతున్న వీరు సామాన్య ప్రజలకు ముప్పుతిప్పలు పెడుతున్న వైనం పై మండి పడుతున్నారు. గతంలో ఏసిబిని సైతం ఆశ్రయించే స్థాయిలో విసిగిపోయారు.

దొరగారూ... వాస్తవాలు తెలుసుకోండి

పాచిపెంట ఘటనను పార్టీలకు ఆపాదించడం సరికాదు

విశాలాంధ్ర-సాలూరు: మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆదివారం పాచిపెంట గ్రామంలో జరిగిన సంఘటనలో వాస్తవాలు తెలుసుకొని పత్రికా ప్రకటనలు జారీ చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సీనియర్ రాజకీయ నాయకులు అయిన రాజన్నదొర ఇద్దరు వ్యక్తుల మధ్య కొట్లాటను రాజకీయ పార్టీలకు ఆపాదించ కూడదన్నారు. ఇద్దరు వ్యక్తులు వ్యక్తిగత కారణాలతో గొడవపడి పరస్పర దాడులు చేసుకుంటే వాటిని రాజకీయ పార్టీల మధ్య వైరంలా మార్చి పత్రికా ప్రకటన ఇవ్వడం సరికాదన్నారు. పాచిపెంట సంఘటన గుర్చి పోలీసు అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. సాలూరు నియోజకవర్గ ప్రజలందరికీ సంధ్యారాణి ఎలాంటి వారో తెలుసు అన్నారు. కక్ష్య సాధింపుకి పాల్పడటం, దాడులు చేయడం తమ అభిమతం కాదన్నారు. ప్రజలు నమ్మి తమకు అందించిన అధికారాన్ని ప్రజాసేవకు అందించాలని చంద్రబాబు సూచించారన్నారు. శాంతిభద్రతల పరిరక్షిస్తూ, సురక్షితమైన పాలన అందించాలనే నాయకుడు చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా తామంతా పనిచేస్తున్నామన్నారు. సీనియర్ నాయకులు అయిన రాజన్నదొర పాచిపెంట ఘటనలో ఏమి జరిగిందో విషయం తెలుసుకో కుండా పత్రికా ప్రకటన ఇవ్వడం వలన పార్టీ కార్యకర్తలు, ప్రజలు భయాందోళనకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇటువంటి తప్పుడు ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు.

ఇంటిపై పడిన పిడుగు

విశాలాంధ్ర-పాచిపెంట : మండల కేంద్రమైన పాచి పంటలో గల గాజులు వీధిలో సోమవారం ఉదయం నుండి కురుస్తున్న వర్షంతో పాటు ఒక్కసారిగా స్లాబ్ ఇంటిపై పిడుగు పడింది. ఈ పిడుగు ధాటికి ఒక్కసారిగా చుట్టుపక్కల వీధుల ప్రజలు భయంతో పరుగులు తీశారు. గాజుల వీధి ప్రజలు భయంతో పరుగులు తీశారు. అయితే పిడుగుపాటుకు స్లాబ్ ఇల్లు పెచ్చులు ఊడాయి అయితే ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రికి అభినందనలు తెలిపిన పిఆర్‌టియు నేతలు

విశాలాంధ్ర-సీతానగరం : రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బొబ్బిలికోటకు విచ్చేసిన సందర్భంపార్వతీపురం మన్యంజిల్లా పిఆర్‌టియు అధ్యక్షులు వోలేటి తవిటినాయుడు, రెండు జిల్లాల నాయకులు, ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. 117 ప్రభుత్వ ఉత్తర్వు రద్దు, తీవ్రస్థాయిలో ఉపాధ్యాయులను మానసికంగా వేధించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ బదిలీ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడం గురించి వివరించారు.

వైకాపా కార్యకర్తలపై దాడులు సరికాదు

మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర-సాలూరు : రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ చూసిన సామాన్య ప్రజలపై దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ లు గాడిలో పెట్టాలన్నారు. పత్రికా సమావేశాలలో శాంతిభద్రతలకు, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత అని చెబుతున్నవారు ఆ దిశగా పరిపాలన కొనసాగించడం లేదన్నారు. ఆదివారం పాచిపెంట మండల కేంద్రంలో వైకాపా సోషల్ మీడియా మండల కన్వీనర్ అయిన సాగర్ రెడ్డిపై అదే గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త కనకల సూర్యనారాయణ దాడిచేసి గాయపరిచారని ఈ విధానం సరికాదన్నారు. అలాగే దళిత నాయకుడు అయిన డోల.బాబ్జికి చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన సిమెంట్ ఫోల్స్‌ను తెదేపా వారు ధ్వంసం చేశారన్నారు. 2006 నుండి సాలూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఏనాడు ఇటువంటి దాడులను ప్రోత్సహించలేదన్నారు. ఇప్పటికీ కూడా బాధ్యత గల పౌరునిగా శాంతిని కోరుకుంటున్నానన్నారు. నూతనంగా ఎన్నిక అయిన ఎమ్మెల్యే, మంత్రి అయిన గుమ్మిడి సంధ్యారాణి తమ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. దాడుల సంస్కృతి సరికాదన్నారు. దాడి చేసినవారిపై కేసుల నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కళింగ వైశ్యులుకి అండగా ఉంటా... ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: కళింగ వైశ్య కుటుంబాలకి అండగా ఉంటానని శాసనసభ్యుల బోనెల విజయచంద్ర అన్నారు. పార్వతీపురం పట్టణ కళింగ వైశ్య సంఘం నాయకులు కొత్తకోట ప్రసాద్ రావు ఆధ్వర్యంలో శ్రీవారి సన్నిధి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయక సన్మాన సభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విజయ్‌చంద్ర హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీకు అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పార్వతీపురాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కాకుండా వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడానికి తన వంతు ప్రయత్నం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రాంత వాసిగా ఇక్కడ పుట్టిన నేను పార్వతీపురం పట్టణ అభివృద్ధి చేసి రుణం తీర్చుకోవాలని ఆలోచనతో ఉన్నట్లుగా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విద్య,వైద్య రంగాలే కాకుండా ఒక మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు,టిడిపి నాయకులు బార్నాల సీతారాం, జయబాబు, బోను చంద్రమౌళి, కోరాడ నారాయణరావు, మజ్జి వెంకటేష్, జనసేననాయకులు చందక అనిల్ పట్టణ వ్యాపారస్తులు, పాల్గొన్నారు.

మన్యం కవి నూనె రమేష్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖపల్లి గ్రామానికి చెందిన మన్యం కవి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నూనె రమేష్‌కు తిరుపతి యస్‌వి యూనివర్సిటీ లో శ్రీశ్రీ కళావేదిక తిరుపతి శాఖ వారి ఆధ్వర్యంలో డాక్టర్ ఉషారాణి నేతృత్వంలో జరిగిన 135 జాతీయ స్థాయి కవిసమ్మేళనంలో 'కవిత కాలక్షేపమా!' అనే కవితా గానం చేసినందుకు ఆయనకు సభికుల హర్షధ్వానాలు నిర్వాహకుల ప్రశంసలు లభించాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 150 మందికి పైగా కవులు పాల్గొని కవితా గానాలువినిపించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చేర్మెన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయ కర్త కొల్లి రామావతి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టె లలిత తదితరులు నూనె రమేష్‌ను ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఘణంగా సత్కరించారు.మారుమూల ప్రాంతం ఐన వి.ఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామంలో పుట్టి సాహిత్యంలో అంచలంచాలుగా ఎదుగుతున్న నూనె రమేష్ పొందిన ఈ సత్కారానికి మండల పెద్దలు గ్రామస్తులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు, మరెన్నో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారుతమ కుమారుడు సాహితీ రంగంలో ముందుకు వెళ్తున్నందుకు తల్లిదండ్రులు నూనె అజరయ్య శాంతి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా జరిగిన శ్రీరమాసత్యనారాయణస్వామివారి కళ్యాణ ఉత్సవం

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట ఎన్ సి ఎస్ చక్కెర కర్మాగార ఆవరణలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అర్చకులు వేదాంతం పవన్‌కుమార్ ఆచార్యులు, డివి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కీర్తిశేషులు అగ్నిహోత్రం శ్రీనివాసా చార్యులు శిష్యబృందం కలిపి ఈపూజా కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు. ఈనెల 13న ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు మంగళవారంతో ముగుస్తాయి. శనివారంనాడు శ్రీహనుమాన్ సీతాలక్ష్మణసమేత శ్రీకోదండ రామస్వామి కళ్యాణాన్ని, ఆదివారంనాడు శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణంజరగ్గా, సోమవారం శ్రీరమాసత్యనారాయణ స్వామివారి కళ్యాణంను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వామివారి ఊరేగింపు కూడా నిర్వహించారు. ఈవార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీరోజు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈపూజలలో భక్తులతోపాటు ఎన్సిఎస్ కర్మాగార ఉద్యోగులు, కార్మికులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం జరిగిన కళ్యాణ వారోత్సవాల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ దావాల నాగరామారావు, ప్లాంట్ ఇంచార్జి మూడడ్ల సూర్యనారాయణ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

అప్పజెల్లెలికొక అభినందన...

కురుపాం ఎమ్మెల్యేగా గిరిజనబిడ్డ తోయక జగదీశ్వరికి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి శాసన సభ్యురాలిగా ఎన్నికైన తోయక జగదీశ్వరి తొలి స్థానిక ఆదివాసీ ఆడబిడ్డ. అత్యంత మారుమూల ఆదివాసీ గ్రామమైన తాడికొండ నుండి తన రాజకీయ ప్రస్థానాన్ని ఆరంభించి అసెంబ్లీ స్థాయి దాకా ఎదిగిన తీరు రాబోయే రాజకీయాలకు ఒక శుభ సంకేతం.

స్వాతంత్రానంతరం అదే గ్రామం నుండి ఎన్నికై గిరిజన గొంతుని ప్రపంచానికి వినిపించిన ఆమె ముత్తాత అడ్డాకుల లక్ష్మునాయుడు (1904-1972) నాగూరు తొలి గిరిజన శాసన సభ్యుడు (1955-1966) వారసత్వాన్ని ఇన్ని దశాబ్దాలకు అందుకున్న ఆదివాసీ వీర మహిళగా చరిత్రకెక్కింది. (ఏకవచన సంబోధనకు మన్నించాలి)

ఇది అతిశయోక్తైన మాట కానే కాదు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుండి భాషాప్రయుక్త ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడడం మొదలుకొని ఇటీవల కురుపాంగా మారిన నాగూరు నియోజకవర్గం వరకూ ఆదివాసీలకే కేటాయించబడుతూ వస్తున్నది. ఇన్నేళ్ళలో నిమ్మక జయరాజు, కోలక లక్ష్మణమూర్తి గారలను మినహాయిస్తే ఎక్కువ కాలం కురుపామో చినమేరంగో సంస్థానల వ్యక్తుల ఏలుబడిలోనే సాగింది.

ఇప్పుడు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మ వలస, కొమరాడ మండలాలు కలుపుకున్న ఒక కొత్త డీలిమిటెడ్ నియోజక వర్గం. అడవులూ, నీటి వనరులు%ొ% కొండలూ, మైదాన ప్రాంతాలు... వర్షపాతమూ, నీటి శాతమూ పుష్కలంగా వున్నా ఇంకా వెనకబడిన నియోజక వర్గంగానే పేరుబడ్డ ప్రాంతమిది. ఐటీడీయేలూ, జీసీసీలూ, ఆశ్రమ పాఠశాలలూ, అభివృద్ధి పథకాలూ అందుతున్నా ఇంకా అక్షరాశ్యతా, ఆర్థిక స్వావలంబనా పెరగాల్సే వున్న ఒకానొక నిర్లక్ష్య ప్రాంతం ఇది. ఇందులో ఆదివాసీలు ఎంత నిష్పత్తిలో ఉన్నా ఆదివాసేతరులే నిర్ణయాత్మక ఓటర్లు గా ఉన్న ఒక విలక్షణ ఎస్టీ నియోజకవర్గం.

ఇంత రాజకీయ చరిత్ర కలిగిన ఈ ఎస్టీ నియోజక వర్గంలో అచ్చమైన స్థానిక జాతాపు కొండ బిడ్డైన జగదీశ్వరి ఒక శాసన సభ్యురాలిగా నిలిచి గెలవడం ఒక అనివార్య ఘట్టంగా రేపటి తరానికి కొత్త కొత్త సంకేతాల్నిస్తూ తీర్పునిచ్చారు ప్రజలు.

ఈగెలుపు క్షణాల్లో...

ఆమె దాటొచ్చిన మలుపులు ఆమె నడిచొచ్చిన దారిని గుర్తు చేస్తున్నాయి.

అప్పటికామె... ఎంపీటీసీ. నేను తాడికొండా ఆశ్రమ పాఠశాలలో. ఎదురైనప్పుడల్లా... పలకరిస్తూ... 'మీ కథలు చదువుతుంటాను మాస్టారూ!' అనేది. గిరిజన సమస్యల గురించి చర్చించేది. వాటి గురించి ఆమె స్పందన చెప్పేది. ఓ రోజు స్టడీ అవర్ లో నేను పిల్లల మధ్యలో కూర్చుని రాసుకుంటూ ఉంటే ఆమె నా వద్దకొచ్చి ఓ ఫేవర్ కావాలని అడిగింది. "అయ్యో ఎంత మాట! చెప్పమ్మా... నేనేం చెయ్యగలనూ?" అని అడిగా. అప్పుడామె అడిగింది కదా... కొండ మీద గ్రామాల నుంచి మా స్కూలుకి ఎదురుగా ఉన్న ఆసుపత్రిలో కొంత మంది రోగులు వైద్యం కోసం ఉండిపోవాల్సి వచ్చింది... వాళ్ళు ఆ రాత్రికి హాస్టల్లో ఆ రాత్రికి పడుకోడానికి వసతి, భోజనాలు కూడా ఏర్పాటు చెయ్యగలరా?' అని.

నిజానికి ఆమె ఆ రోజున్న స్థాయిలో నన్ను ఆదేశించవచ్చు. కానీ ఆ పని చేయలేదామె. ఆ తెల్లవారి వాళ్ళు ఎదురై నాకు నమస్కరించేరు. అది నేను స్వీకరించేనో లేదో గుర్తు లేదు కానీ... అది ఆమెకు చెందాల్సినదని అని అనుకోవడం నాకు గుర్తున్నది.

ఆ రోజే అనుకున్నాను ఈమె మరింత ముందుకు వేగంగా నడవగలదని...

మరో సంఘటన కూడా ఆమె నడకని గురుతు చేస్తున్నది...

కురుపాం మండల కేంద్రంలో గల మా స్కూల్ రోడ్డు పైనే ఉంటుంది. మా పక్కనే ఉన్న ఎంజేపీ స్కూలు విద్యార్థి పాముకాటు కి గురై మరణిస్తే ఆ గ్రామస్తులు, ప్రజలు రోడ్డు బ్లాక్ చేసి ధర్నా చేస్తున్నారు. మార్గం లేక అక్కడే నిలబడి దిక్కులు చూస్తున్న నాకు మీడియా హడావిడి కనిపించింది. మైకు ముందుకొచ్చి మాట్లాడ్డం కోసం అందరూ ఎగబడుతున్నారు. గేటు ముందు నిశ్శబ్దంగా నిరసన చేబడుతున్న జగదీశ్వరి కనిపించింది. ఎవరూ ఆమె ముందు లేరు. ఒంటరిగా... మౌనంగా... ఏదో దీక్షలో ఉన్నట్టు ఆమె ఓ మూలగా.

నేను వెళ్ళి పలకరించాను. అప్పటికి ఈమె గుర్తించదగిన నాయకురాలు కాదు.

"అమ్మా! మీరూ వెళ్ళి మైక్‌లో మాట్లాడొచ్చు కదా" అన్నాను.

అప్పుడామె నాతో చెప్పింది కదా... "నాకు కావాల్సింది పబ్లిసిటీ కాదు మాష్టారూ! ఆ తల్లిదండ్రులకు దక్కాల్సిన న్యాయం" అంది. "నా నిరసన... ఈ స్కూలుకి ఒక కాంపౌండ్ వాల్ కట్టించ గలిగితే చాలు, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా వుంటాయి. ఏ తల్లికీ, ఏ తండ్రికీ ఇలాంటి గర్భశోకం కలగకుండా వుండాలి" అంది.

అమ్మా! జగదీశ్వరీ! ఈ గెలుపుని ఆ రోజే చూసేసాను.

నడవాల్సిన దూరమెంతో ఉంది.

నీముందు ఎన్నో ఆశలున్నాయి. అవి తీర్చ ఆశయాలుగా మార్చుకోవాలి. ఎన్నో అర్తనాదాలున్నాయి. ఆలకించు తల్లీ! డోలీ మోతలున్నాయి. దారి చూపు తల్లీ! అక్రమాలెన్నో ఉన్నాయి. సక్రమం చేయు తల్లీ! ఎన్నో కష్టాలు చూసిన దానవు, అవమానాల్ని దాటి వచ్చినదానవు. సమర్థత లేనిదానవని అవమానించబడ్డావు. నిరూపించుకో తల్లీ! ఈ నేల పుట్టిన కొండపిల్ల ఎంతటి కొండనైనా పిండిచేయగల సమర్థత గలదని నిరూపించు తల్లీ! నువ్వు ముందుండి ఈ నేల సమస్యల్ని శ్రద్ధగా ఆలకిస్తావని, మరింత మందికి స్ఫూర్తి వవుతావని ఆశిస్తూ... ఆదివాసీలందరి తరపున అప్పజెల్లెలికొక అభినందన మాలకడుతున్నానిదుగో!

రచయిత : మల్లిపురం జగదీష్, గిరిజన ఉపాధ్యాయుడు, జిఎల్ పురం

వైకాపా వెంటే మన్యవాసులు

విశాలాంధ్ర-చింతపల్లి : అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనుజారాణిని చింతపల్లి, జికె వీధి మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు వైకాపా నాయకులు, కార్యకర్తలు సోమవారం పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో వైకాపా హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకున్న శు భ సందర్భంగా చింతపల్లి జడ్పీటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, చింతపల్లి, జికె వీధి ఎంపీపీ లు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, చింతపల్లి సర్పంచ్ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత ల ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీల వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభంజనంలోనూ అరకు పార్లమెంటు పరిధిలో వైకాపా తన సత్తా చాటింది అన్నారు. 2014, 2019 ఎన్నికల్లోనే గాక 2024 సార్వత్రిక ఎన్నికలలోనూ అరకు పార్లమెంట్, అరకు, పాడేరు శాసనసభ స్థానాలలో వైకాపా తన విజయ పరంపర కొనసాగించిందన్నారు. హ్యాట్రిక్ విజయాలతో మన్య ప్రాంతంలో వైకాపా దూసుకుపోతుందన్నారు. మన్య ప్రాంత వాసులంతా వైకాపా వెంటే ఉన్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, జికె విధి మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వృక్షాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

విద్యుత్ సిబ్బంది స్తంభాలు, వైర్లకు మరమ్మతులు

విశాలాంధ్ర-సాలూరు జూన్ : పట్టణంలో మున్సిపల్ సిబ్బంది పలుచోట్ల భారీ వృక్షాలను జెసిబి సహాయంతో తొలగిస్తున్నారు.మొన్న ఈదుదుగాలులకు పట్టణంలో పలుచోట్ల భారీ వృక్షాలు ఇంటిపై,రోడ్లపై, పడడం జరిగింది.ఇలా జరగడం వల్ల విద్యుత్ వైర్లు ఎక్కడికి అక్కడ తెగిపోవడం జరిగింది. అంతేకాకుండా రోడ్డుపై పెద్దపెద్ద వృక్షాలు పడడంతో సాలూరు నుంచి మామిడి పల్లి వెళ్లే రూటులో తీవ్రంగా ట్రాఫిక్ స్తంభవించింది. దీనికి స్పందించి పురపాలక సంఘం కమిషనర్ ప్రసన్న వాణి వారి సిబ్బందితో మెయిన్ రోడ్, శివాలయం డౌన్, దండిగాం రోడ్,గాంధీ నగర్,ఆయా ప్రాంతాల్లో పడిపోయిన చెట్టును భారీ వృక్షాలను తొలగించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చేశారు. పలు వీధుల్లో,మెయిన్ రోడ్‌లో వీధి దీపాలు వేయడం జరిగింది. అలాగే విద్యుత్ అధికారులు కూడా పడిపోయిన స్తంభాలను తెగిన వైర్లను మరమ్మతులు చేపట్టి స్థానికులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ వచ్చేలాగా చర్యలు చేపట్టారు. శానిటరీ ఇన్స్పెక్టర్, ఏఈ సూర్య నాయుడు, లైటింగ్ సూపర్వైజర్ సతీష్, మున్సిపల్ కార్మికులు.

ఘనంగా బక్రీద్ పండుగ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని అప్పయ్యపేట గ్రామంలో సోమవారం నాడు బక్రీద్ పండుగను పురస్కరించుకొని మసీద్ వద్ద ముస్లింసోదరులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాలతో పండుగను జరుపుకున్నారు. ముస్లింలత్యాగనిరతకి, ధర్మానిబద్ధతికి ప్రతీక బక్రీద్ పండుగని మసీదు ఇమామ్ గులామ్ రసూల్ తెలిపారు. మసీదులో ప్రత్యేక పూజలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో షేక్ బషీర్, షేక్ మహబూబ్, షేక్ నౌసాద్, షేక్ షాజహాన్, షేక్ రెహమాన్, షేక్ అలీ, షేక్ షానావాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమేజాన్ ఫ్రెష్ సేవలు విస్తరణ

విశాలాంధ్ర-పాడేరు : పండ్లు, కూరగాయలు, చిల్డ్ ఉత్పత్తులు, సౌందర్యం, బేబీ, పర్సనల్ కేర్, పెట్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలు వంటి తడి మరియు పొడి కిరాణా సరుకుల యొక్క ఫుల్-బాస్కెట్ కిరాణా సరుకుల సర్వీస్ అమేజాన్ ఫ్రెష్ 130కి పైగా నగరాలకు విస్తరించినట్లు అమేజాన్ ఇండియా ప్రకటించింది. అమేజాన్ ఫ్రెషన్ ఇన్ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ మాట్లాడుతూ అమేజాన్ ఫ్రెష్ సెల్లర్స్ పండ్లు కూరగాయలను 11,000కి పైగా రైతుల నుండి సేకరిస్తారన్నారు. '4-స్టెప్ నాణ్యతా తనిఖీ' ద్వారా ఉత్పత్తి నాణ్యతను నిర్ధారిస్తారన్నారు. అంబాలా, ఔరంగాబాద్, హొషియార్ పూర్, ధార్వాడ్, ఉనా, సూరి వంటి 130కి పైగా నగరాల్లో ఈ సేవలు అందిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఇతరులు తమ వారపు/నెలవారీ బాస్కెట్‌ను రూపొందిస్తున్నప్పుడు అమేజాన్ ఫ్రెష్ సెల్లర్స్ బ్యాంక్ భాగస్వాముల నుండి ఉత్తేజభరితమైన డీల్స్ పొందుతారన్నారు. అమేజాన్ ఫ్రెష్ భారతదేశంలో కిరాణా షాపింగ్‌ను పునః రూపుదిద్దుతోందన్నారు. భారతదేశంలో 130 పట్టణాల్లో మా కస్టమర్స్ యొక్క ఇంటి ముంగిటకు మేము తాజా ఉత్పత్తి, నిత్యావసరాలు తెస్తాం అన్నారు. కస్టమర్స్ కు సేవలు అందించడానికి విస్తరణ దృష్టి కేంద్రీకరణలు తమ నిబద్ధతను ప్రదర్శిస్తాయనీ, తాజా ఉత్పత్తి నాణ్యతా ఉత్పత్తులపై, నిత్యావసరాల కోసం ఉత్తమమైన ఆన్ లైన్ షాపింగ్ అనుభవాన్ని వారికి అందిస్తామన్నారు. ఇంకా, కస్టమర్స్ క్యాష్ బాక్, ఆఫర్స్, బ్యాంక్ డిస్కౌంట్స్ నుండి ప్రయోజనాలు పొందవచ్చునని చెప్పారు.